# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పట్టాదారు పాసు పుస్తకాలను భవిష్యత్తులో నేరుగా రైతుల ఇంటికే పోస్టల్ అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపిన మంత్రి కె. అచ్చెన్నాయుడు.**
2. **రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన తర్వాత 26 ఏళ్లలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూడౌన్ చేసినట్లు చెప్పిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ .**
3. **అమరావతి నుంచి విజయవాడకు కరకట్ట పై వెళ్ళే అవసరం లేకుండా త్వరలోనే స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్న మంత్రి నారాయణ.**
4. **విజయవాడలో నేటి నుంచి ప్రారంభం కానున్న 36వ విజయవాడ పుస్తక మహోత్సవాలు.**

==========================

అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలను భవిష్యత్తులో నేరుగా రైతుల ఇంటికే పోస్టల్ ద్వారా పంపేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలసలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్త పాస్‌పుస్తకాలలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సవరించనున్నట్లు తెలిపారు. పుస్తకంలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూమి వివరాలన్నీ కనిపిస్తాయని చెప్పారు.

---------------------------

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో కలిసి మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వం రైతులకు పట్టాదారు పుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.

---------------------------

2019-20 నుంచి 2023-24 మధ్య విద్యుత్తు నియంత్రిత కాలానికి సంబంధించి 3వేల 3 వందల 98 కోట్ల రూపాయల ట్రూఅప్ భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఏర్పాటు

చేసిన తర్వాత 26 ఏళ్లలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూడౌన్ చేసినట్లు మంత్రి చెప్పారు. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించి.. ఆ మేరకు ఛార్జీలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)గా (వీబీ–జీ రామ్ జీ ) మార్చడాన్ని తిరుపతి జిల్లా వాసులు స్వాగతిస్తున్నారు. ఈ పథకంలోని పని దినాలు 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పని దినాలు పెంచడం ద్వారా ఆర్థికంగా లబ్ది పొందుతామని తిరుపతికి చెందిన ఉష పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 2025 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో భారతదేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

2025 సంవత్సరం భారత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఒక గొప్ప మలుపుగా నిలిచింది. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, అంతరిక్ష పరిశోధన, అణుశక్తి వంటి రంగాల్లో భారత్ ప్రపంచ స్థాయిలో తన ప్రభావాన్ని స్పష్టంగా చూపించింది. ఇండియా ఏఐ మిషన్ కింద 10 వేల కోట్ల రూపాయల పైగా పెట్టుబడులతో దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక వసతులు విస్తరించగా, 38 వేల జీపీయుల జాతీయ కంప్యూట్ సామర్థ్యం అందుబాటులోకి వచ్చింది. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ 2025 గ్లోబల్ ఏఐ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో నిలవడం విశేషం. జాతీయ కీలక ఖనిజాల మిషన్ ద్వారా అరుదైన లోహాలపై విదేశీ ఆధారాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టారు. అంతరిక్ష రంగంలో నిసార్ ఉపగ్రహ ప్రయోగం, తొలి భారతీయ వ్యోమగామి ఐఎస్ఎస్ ప్రయాణం దేశ ప్రతిష్టను పెంచాయి. అణుశక్తి రంగంలో శాంతి చట్టంతో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కలిసి 2025ను భారత సాంకేతిక స్వావలంబనకు మైలురాయిగా నిలిపాయి.

---------------------------

అమరావతి నుంచి విజయవాడకు కరకట్ట పై వెళ్ళే అవసరం లేకుండా త్వరలోనే స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు, గుంటూరు ఛానెల్ పై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ నెలాఖరుకు స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

---------------------------

విజయవాడ బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈరోజు నుంచి ఈనెల 12వ తేదీ వరకు 36వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు పుస్తక ప్రదర్శన జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా 300 మంది ప్రచురణకర్తలు ఈ మహోత్సవంలో పాల్గొంటారని వివరించారు. మొత్తం 309 పుస్తక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తొలిరోజు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ. నరసింహ ఈ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

---------------------------

క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)చైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతిలో మల్టీ పర్పస్ అకాడమి నిర్మాణానికి శాప్ ఛైర్మన్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెయిట్ లిఫ్టింగ్, మల్టీపర్పస్ హాలు, క్రీడాకారులకు వసతి గదులు అకాడమీలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతిని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొంటూ..

వాయిస్... 30 సెకన్లు

---------------------------

తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే లాగా ప్రపంచ తెలుగు మహాసభలలో కార్యక్రమాలను రూపకల్పన చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. గుంటూరులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రేపటి నుంచి 5వ తేదీ వరకూ మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిన్న రాత్రి ఆయన సభ ఏర్పాట్లను పరిశీలించారు. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాలను వీక్షించేందుకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

---------------------------

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా నందిగామ శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మార్కెట్ యార్డులో ఏపీ మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసలు కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటను విక్రయించుకునేలా అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని నేరుగా ప్రభుత్వం నుంచే మద్దతు ధర లభిస్తుందని ఆమె పేర్కొన్నారు.

---------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగాను, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఈశాన్య, తూర్పు దిశగాను గాలులు వీస్తున్నాయని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఈ రోజు దట్టంగా పొగమంచు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశము వుందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్... 20 సెకన్లు

=====================